# చైతన్య స్ఫూర్తి

ఆకాశం మేఘాల తోరణాలు కట్టుకుని రంగు మార్చుకుంది. అప్పుడే ప్రారంభమైన చిన్న చిన్న తుంపర్లు, చెట్ల ఆకులమీద పడి, వింత సంగీతాన్ని అందిస్తున్నాయి.

వసుధ కిటికీదగ్గిరే వున్న మంచం మీద కూచుని, కిటికీ పక్కనే వున్న నిత్యమల్లి చెట్లకేసి చూస్తోంది. ఆకుల మీద పడే ప్రతి నీటిబిందువూ ముత్యంలా మెరుస్తూ కిందికి జారిపోతోంది. ఈ దృశ్యం ఆమెలో యెన్నో ఆలోచనల్ని రేకెత్తించింది. నీటిబిందువు శాశ్వతంగా, ఓచోట వుండిపోగలదా? అది సంభవమని ఆమెకి అనిపించలేదు. ఎప్పటికైనా ఆ బిందువు చెదిరిపోయి, భూమిలో యింకిపోవల్సిందే అనుకుంది. ఆమె వేదాంత ధోరణికి ఆమెకే నవ్వొచ్చింది. ఏదీ శాశ్వతంకాని, యీ విశ్వంలో పట్టుదల శాశ్వతంగా వుండిపోవడంలో అర్థం లేదనిపించిం దామెకి. అర్థంలేని పట్టుదలతో, తనని భర్తకు దూరంచేసిన తండ్రి కాఠిన్యత, ఆమెకి జుగుప్స కలిగించింది. తండ్రి పట్టుదల విడిచిపెట్టడు. ఆయన పట్టుదలను పరిహసించి, త్రోసిరాజనే ధైర్యం తనకి లేదు. కాని యీ రోజు తన చేతిలోపడిన భర్త ఉత్తరం తనలో తుపాను రేపి, ఒక విధమైన చైతన్యాన్ని రేకెత్తించిందంటే ఆశ్చర్యం లేదేమో! ఆ వుత్తరంలో పేర్కొన్న విధంగానే, ఆయన తనకోసం వేదనపడుతూ, కృంగిపోతూంటే నిజంగా అందుకు కొంత బాధ్యత తనూ తీసుకోవాల్సివుందేమో అనుకుంది. ఆమె ఆలోచనలు వుత్తరం మీదికి పోయాయి. మరోసారి ఆ వుత్తరాన్ని చదవాలన్న జిజ్ఞాస కలిగింది. మళ్ళీ చదవడం ప్రారంభించింది.

'ప్రియ వసుధా,

ఇంతకు ముందు నీ కెన్నో వుత్తరాలు రాశాను. అయితే, అవి నీకు చేరి వుంటాయనే నమ్మకం నాలో పూర్తిగా లేదు. కారణం – అవి మీ నాన్న చేతిలో పడి, మట్టిపాలయ్యుంటయ్. అయినా ఆశతో వుత్తరం రాస్తున్నాను. నిజం నువ్వే చెప్పు వసుధా. నేను చేసిన తప్పేంటి? మీ నాన్నకి, నామీద యెందు

యమ్. హనుమంతరావు

కింత కష్ట?...ఆయన నీకు చేయించిన అయిదుతులాల బంగారపు గొలుసును అమ్మేశాననేగా యీ కసి? అది యే పరిస్థితుల్లో అమ్మానో నీకూ తెలుసు. నా వుద్యోగం వూడిపోయి, మరే యితరాధారమూ లేక, పిచ్చిగా తిరిగే రోజుల్లో, నువ్వూ, అమ్మా, చెల్లీ—అందరం ఒకేసారి తిండికి లేక చావడం నాకు యిష్టంలేక ఆ చొరవ తీసుకున్నాను. అదీ—నీ అభిమతం తీసుకునే చేశాను. రేపటికోసం చూస్తే, యీ రోజు యేం జరుగుతుందో, యెవరికి తెలుసు? రోజులు యెప్పటికైనా మారితే, గొలుసు చేయించకపోతానా, అని యెంతో నచ్చజెప్పడానికి ప్రయత్నించాను మీ నాన్నకి. కాని ఫలితం లేకపోయింది. చెవిటివానిముందు శంఖం వూదినట్టే అయ్యింది. నేను చేసిన యీ తప్పుకి (నా దృష్టిలో తప్పుకాదు) శిక్షగా, మనిద్దర్నీ క్రూరంగా దూరం చేశారు. సున్నితమైన హృదయాల్లో, సూదులు గ్రుచ్చారు. మీ యింటి గడప కూడా తొక్కొద్దని, నా నీడయినా సరే, మీ యింటిమీద పడ్డానికి వీల్లేదని నలుగురి మధ్య చెప్పి, నన్ను అవమానించారు మీ నాన్న. అయినా బాధపడలేదు నేను. ఆ అవమానాన్ని దిగమింగుకున్నాను. అభిమానాన్ని అణచుకున్నాను. నిజం చెప్పాలంటే, మీ యింటితో నా కేంపని వసుధా? మీ నాన్న ప్రమేయం అంతకంటె అవసరం లేదు. నా క్కావల్సింది నువ్వు; నువ్వే వసుధా! నీకోసమే నేను జీవిస్తున్నాను. నీకోసమే అవమానాన్ని దిగమింగుకుంటున్నాను. నీకోసమే అంతులేని సహనాన్ని పెంచుకుంటున్నాను. కాని ... కాని ...నా బాధను యెవరు అర్థం చేసుకుంటున్నారు? ఏదో తెలుసుకోలేని తపనా, విరక్తి పుట్టించే ఒంటరితనమూ నన్ను కృంగదీస్తున్నాయి. నా ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోంది. ప్రస్తుతం నుంచి వుద్యోగం చేస్తున్నాననే ఆనందం వుండి కూడా లేనట్టే. అది నా మనోవ్యథ మరుగున పడిపోయింది. నువ్వు మాతో వుంటే, ఆ ఆనందానికి అవధు లుండేవి కావేమో!

'వసుధా, నా వుత్తరాల్లో యే ఒక్కటీ నీకు అందలేదా? లేక అందినా మీ నాన్నలా నువ్వూ నన్ను హింసించి తమాషా చూడాలనుకుంటున్నావా? నువ్వంత కఠినాత్మవని నే ననుకోను. నీ దగ్గర్నించి యే ఒక్క వుత్తరానిక్కూడా జవాబు రాకపోయినా, యెప్పటికైనా రాస్తావనే మొండి నమ్మకం, యేదో ఒక వుత్తరమైనా నీ చేతిలో పడకపోతుందా—అనే ఆశా, నాలో అంతరించలేదు. అందుకే, యిలా వుత్తరాల వర్షం కురిపిస్తున్నారు. ఈ వర్షం, మీ నాన్న హృదయాన్ని కరిగించకపోయినా, నేను విచారించను. కాని నీది



రాతిహృదయం కాదు ... ఇంతకంటె నే నింకేం రాయగలను చెప్పు? ఈ రోజుగాని, నే నో ఫోటో తీయించుకుని నీకు పంపితే, ఆ ఫోటోలో వున్న వ్యక్తి యెవరో చప్పున గుర్తుపట్ట లేవేమో? ఇందుకు కారణం యేమని చెబుతాను? ఇలాగే రోజులు గడిస్తే, నే నేమవుతానో నాకే బోధపడ్డంలేదు. భవిష్యత్తు ఒక ప్రశ్నార్థకంగా వుంది. అమ్మ మరీ బెంగపెట్టుకుంటోంది. ఏం చెయ్యను? ఆత్మాభిమానం అందరికీ వుంది మరి! వుంటా ...

నీ కృష్ణ

ఆ వుత్తరం చివరి పేరాలో ఓచోట

నీటిబిందువులు పడి అక్షరాలు చెరిగి నష్టయ్యాయి. బహుశా, అవి ఆయన అశ్రువులేమో!... వసుధ యింక వూహించలేకపోయింది. గట్టిగా ఓ నిశ్వాసం వదిలింది. ఆమె కళ్ళల్లో నీరు గిర్రున సుళ్ళు తిరిగింది. భర్త, మాసిన గడ్డంతో, లోతుకు పోయి నీరసించిన కళ్ళతో, దీనంగా చూస్తూ, తనెదుట నుంచున్న ట్టయ్యేం దామెకి చలించి పోయింది. ఆమె హృదయం మౌనంగా బావురుమంది. కళ్ళల్లో సుళ్ళు తిరుగుతున్న నీరు, కట్ట తెంచుకున్న ప్రవాహంలా, చెక్కిళ్ళమీదికి జారిపడినై. కళ్ళొత్తుకుంది. తండ్రి పట్టుదల మరీ క్రూరంగా వుందేమో నన్పించింది. ఇంతకుమునుపు భర్త రాసిన వుత్తరాల్లో ఏ ఒక్కటీ తన చేతిలో పడక పోయినందుకు బాధపడింది. ఈరోజు నాన్న యింట్లో లేరుగాబట్టి యీ వుత్తరమైనా చూడగలిగింది. లేకుంటే యిదీ దొరక్కపోనేమో. పాపం తనగురించి మనోవ్యథ పెంచుకుని ఆయన యెంతగా పరితపిస్తున్నారో. ఇన్నాళ్ళూ తను వుపేక్షించడం క్షమించరానిది. తనకి యీ జీవితంలో యింక కావల్సిం దేవిటి? భర్త సాన్నిధ్యమేగా! ఇప్పుడు కాక పోయినా, యెప్పటికైనా లోకులు తననే ఆడిపోస్తారు వ్యక్తిత్వం లేనందుకు. అసలు, ఆ అవకాశం యెందు కివ్వాలి? నాన్న పట్టుదలతో, ద్వేషంతో తన కేం సంబంధం వుంది? నిజం చెప్పుకోవాలంటే మూడుముళ్ళూ పడిన తర్వాత, తను పరాయివ్యక్తే!... ఆలోచిస్తున్న కొద్దీ ఆమెలో అంతులేని భావాలు వుత్పన్న మౌతున్నాయి.

క్రమంగా వర్షపుజల్లు అధిక మయ్యింది. చల్లని గాలి, నరాల్ని జివ్వు మన్పిస్తోంది. కిటికీలోంచి అప్పుడప్పుడు గాలి విసురికి జల్లు రాసాగింది. చప్పున కిటికీ తలుపులు వేసి, మంచం మీద ఒరిగిపోయింది వసుధ.

* * *

రాత్రి యెనిమిది కొట్టింది గడియారం. వర్షం తగ్గింది కాని, చిటపట చినుకులు యింకా పడుతూనే వున్నయ్. వాతావరణం స్తబ్దతను పుంజుకుంది.

భానోజీరావు అప్పుడే తిరిగివచ్చాడు, పైవూరెళ్ళి. గొడుగు ఓ మూల పెట్టేసి, భార్యను కేకేశాడు. సీతాలక్ష్మి చరచరా వచ్చింది తువ్వాలు పట్టుకుని. భానోజీరావు దుస్తులు మార్చుకుంటూ అడిగాడు:

"ఉత్తరాలు యేమన్నా వచ్చాయా?" అని.

"రాలేదండీ!" జవా బిచ్చింది సీతాలక్ష్మి. ఆమెకి తెలీదు, అల్లుడి దగ్గర్నించి ఉత్తరం వచ్చినట్టు; కూతురు చెప్ప లేదు కూడాను. వసుధ కావాలనే చెప్ప లేదు. చెప్పినా, ప్రయోజనం ఏమీ లేదని ఆమెకి తెలుసు. భర్త మాటను వేద వాక్యంలా శిరసావహించే తల్లి, తనకి

జరిగిన అన్యాయానికి, ఎప్పుడూ సాను భూతికూడా చూపలేదు. ఆమె దో వింత తత్వం. భర్త ఏమంటే, అదే అంటుంది. ఒక్కొక్కప్పుడు మాతృ ప్రేమ పెళ్లు బికి, ఆతురిపట్ల సానుభూతి కలిగినా, బలవంతంగా అణచుకునే మనస్తత్వాన్ని అలవర్చుకుంది.

"అల్లు డొచ్చాడా?" విసురుగా అడి గాడు భానోజీరావు; తను ఊళ్ళో లేనట్టు తెలుసుకుని వచ్చివుంటాడేమో నని అతని అనుమానం.

"లేదండి...ఎందు కొస్తాడు? రావ ద్దని మీరు చెప్పాక, పూర్తిగ రావడమే మానుకున్నాడు."

"వాణ్ణి అలా దూరంగానే ఉంచాలి. అంతేకాదు...కోర్టుకి లాగి మూడు చెరు వుల నీళ్ళు తాగిస్తేగాని బుద్ధిరాదు ఆ ప్రబుద్ధుడికి." కోపంగా అన్నాడు.

సీతాలక్ష్మి మనస్సు చివుక్కుమంది. "కోర్టువరకూ ఎందుకు లెండీ?" మెల్లగా అంది. ఈ ప్రశ్న వెయ్యకండా వుండ లేకపోయిం దామె.

"నోర్మయ్. నీకు ఏన్నోసార్లు చెప్పాను లక్ష్మి — ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకోవద్దని; బుద్ధుండక్క ర్లేదూ?" గర్జించాడు భానోజీరావు.

సీతాలక్ష్మి నోటికి, కనిపించని తాళం పడింది. ఇదంతా లోపల్నుంచి వింటూన్న వసుధకి, వొళ్లు మండిపోయింది. ఆ కోపావేశంలో, హృదయస్పందన వేగాన్ని అందుకుంది. తండ్రి కాఠిన్య తకు ఒక హద్దంటూ లేకపోవడం, ఆమెలో అంతకు ముందే అంకురించిన ద్వేషం, అధికమయ్యింది. విసురుగా బైటికి వచ్చింది. "ఇదిగోండి నాన్నా ఉత్తరం...ఆయన రాశారు." అంటూ చేతిలోని ఉత్తరం అందించింది తండ్రికి. ఆమె కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయ్.

భానోజీరావు స్తంభించిపోయాడు, కూతురు చేతిలో ఆ ఉత్తరం పడినందుకు. మండిపడ్డాడు. ఉక్రోషంతో అందుకున్నా డా ఉత్తరాన్ని. గబగబా చదివాడు. అతని మొహం ఎర్రబారింది. కళ్ళల్లో కెంపురంగు పులుముకుంది. కనుబొమలు ముడిపడ్డాయ్. ఈ రోజు, తను యింట్లో లేకపోవడమే, యీ అనర్థానికి కారణ మయ్యిం దనుకున్నాడు.

"ఈ కవరు నువ్వెందుకు చించి, ఉత్తరం చదివావు వసుధా?" వ్యగ్రే కంగా అడిగాడు, కూతురి మొహంలోకి సూటిగా చూస్తూ. "నాకు వచ్చిన ఉత్తరం చించకుండా ఎలా ఉండటం నాన్నా?" ధైర్యాన్ని కూడగట్టుకుని, తడబా టేమీ లేకుండా అంది వసుధ.

భానోజీరావు ఆమెకేసి ఆశ్చర్యంగా చూశాడు. కూతురు తనని ఎదిరిస్తూ మాట్లాడ్డం యిదే మొదటిసారిగా గుర్తించాడు.

"నీకు రాసిన ఉత్తరం అయ్యుం డొచ్చు. కాని, అల్లుడు రాసిం దన్న

విషయం నీకు తెలుసు. అతడికీ, మనకీ గల వైరుధ్యం నీకు బాగా తెలుసు. అటువంటి పరిస్థితుల్లో, నువ్వీ ఉత్తరాన్ని ముట్టుకోకూడదు ... తెలుసా ?'' శాసిస్తున్నట్టుగ అన్నాడు.

''ఈ విషయాన్ని, మీరు ముందుగా నాతో ఎప్పుడూ చెప్పలేదు నాన్నా !'' అంది సౌమ్యంగా.


భానోజీరావుకి ధైర్యం కలిగింది. కూతురిలో ఏ విధమైన మార్పూ రాలేదన్న నమ్మకం ఏర్పడ్డంతో కోపం సగం తగ్గింది.

"సరేలే ! ఇప్పుడు చెప్పానుగా ! ఇంకెప్పుడూ యీ వుత్తరాలు చూడకు," అంటూ, ఆ ఉత్తరాన్ని కసిగా ముక్కముక్కలు చేసి ఓ మూలకి విసిరేశాడు.

తన హృదయాన్నెవరో తూట్లు చేస్తున్నట్టయ్యింది వసుధకి. కోపం కట్టతెగి ప్రవహించింది. ఒక్కసారి కంపించిపోయింది. తనని తండ్రి ఆ విధంగా శాసించినా తను వూరుకుందిగాని, భర్త రాసిన ఉత్తరాన్ని తనెదుటే అలా చించి పారేయడం, ఆమెకి ఎంతో కష్టం కలిగించింది. నిర్లక్ష్యంగా నే ఓ నవ్వు నవ్వింది.

"ఎంత కఠినహృదయులు నాన్నా మీరు ? నా భర్త, అగ్నిసాక్షిగా నన్ను వివాహం చేసుకున్న నా భర్త, నాకు రాసిన ఉత్తరాలు చదవొద్దని, మీరు నన్ను శాసించడం హాస్యాస్పదంగా వుంది నాన్నా ! నేను మీ కూతుర్నే కావచ్చు. కాని, నాకు పెళ్ళయిన క్షణం నుంచీ, నేను పరాయి వ్యక్తిని. భర్తతోటిదే నాకు ప్రపంచం. శాశ్వతమైన అనుబంధం అదేను. ఆ విషయాన్ని మీరు విస్మరిస్తున్నారు. అదే నా విచారం నాన్నా ! మీలో ఏర్పడ్డ కాఠిన్యత ఎప్పటికయినా కరుగుతుందని ఆశించాను. అర్థంలేని మీ పట్టుదల పటాపంచ లవుతుందని ఎదురుచూశాను. కాని, నా ఆశలు ఫలించలేదు. మీలోని కరుకుదనం ఉన్నత ప్రమాణాల్ని అందుకుంటుందే గాని, కాస్తంతయినా కరగడం లేదు. మీ పట్ల నాకు గల గౌరవభావంతో యిన్నాళ్ళూ సహనం వహిస్తూ వచ్చాను. కాని, నా సహనం నన్నే పరిహసించే రోజు లొచ్చాయి. ఇలా ఎన్నాళ్ళు భర్తను దూరం చేసుకుని, మీ పంచ నుంటాను నాన్నా ? ఇలా ఎన్నాళ్లు మీ కాఠిన్యతకు చేయూత నిస్తుంటాను ? మీ పట్టుదల, మీ ద్వేషం మీరు చూసుకుంటున్నారు గాని, నా జీవితం మాట ఏమిటి? నా భవిష్యత్తేం కావాలి ? అది ఎందుకు ఆలోచించరు మీరు ?...'' ఆవేశంగా చెప్పుకుపోయింది వసుధ. ఉద్రేక శిఖరానికి పోయి. కాస్త ఆగింది నిట్టూరుస్తూ.

భానోజీరావు చకితుడయ్యాడు. కన్న కూతురు తనని యిలా యెదిరించే రోజు వస్తుందని అతను యెప్పుడూ




వూహించలేదు. ఆమె అమాయకురాలనే యిన్నాళ్ళూ భావించాడు. అందుకే తన మాట జవదాటదన్న ధైర్యం వుండేది. కాని, ఈనాడు ఆమె ధోరణి చూస్తుంటే, అతనికి మతిపోయినట్టయింది. ఓ పక్క వొళ్ళుతెలియని కోపం ముంచుకొస్తోంది.

"ఏమిటి వసుధా నీ ధోరణి? ఒంటి మీద తెలివి వుంచుకునే మాట్లాడు తున్నావా?" కోపంగా అన్నాడు.

"ఆ సందేహం ఏమీ అవసరంలేదు నాన్నా! ఇన్నాళ్ళూ నేను తెలివితక్కువగా ప్రవర్తించినందుకు, యిప్పుడు చింతిస్తున్నాను."

"ఏమిటీ మొండి జవాబులు? ఎప్పుడూ లేని యీ అధికప్రసంగం యిప్పుడు నీకెలా అబ్బింది?"

"పరిస్థితులు నాన్నా!"

"వసుధా!" గర్జించాడు. అతని కంఠం ఆ యింట్లో ప్రతిధ్వనించింది.

సీతాలక్ష్మి కలవరపడింది. పరిస్థితి యెలాంటి రూపాన్ని తీసుకుంటుందోనని ఆమె గాభరాపడింది. భర్తకి కోపం వస్తేనే ఆమెకి భయం.

"అమ్మాయ్ వసుధా! నువ్వూరుకో అమ్మా!" కూతురికి దగ్గరగా పోయి అంది.

వసుధలో మార్పు రాలేదు.

"ఇంకా యెన్నాళ్ళిలా వూరుకోవడమమ్మా? సహనానికికూడా ఒక సరిహద్దు వుండాలి. నేనూ వుప్పూ, కారం తింటున్న మనిషినే. నాకూ అనుభూతులున్నాయ్; మంచీ, చెడూ తెలుసుకునే పరిజ్ఞాన ముంది. స్వాభిమానం వుంది. 'నా' అనే వ్యక్తులమీద ఆదరణ వుంది.


జీవితమంటే మమకారం వుంది. అయితే వీటన్నింటినీ యిన్నాళ్ళూ బలవంతంగా అణచిపేశాను. నాన్నగారిలో మార్పు వస్తుందని, కనీసం కన్న కూతురు కోసమైనా, తన పట్టుదలను వదులు కుంటారని వేచి చూశాను. కాని, ఆ సూచన లేమీ అగుపించడంలేదు సరికదా, ద్వేషం కరుడుగట్టుకు పోతోంది. ఆయన్ని కోర్టు కీడ్చి సర్వ నాశనం చెయ్యడానికూడా వెనుకంజ వెయ్యడం లేదంటే, యింతకంటె క్రూరత్వం మరోటి లేదంటాను. ఆయన వినాశం, ఆయన అగౌరవం నాదికాదా? నాకు ఆపాటి విచక్షణజ్ఞానం లేదా? నా కోసం ఆయన యెంతగా పరితపిస్తు న్నారో, మనోవ్యధతో యెలా ఆరో గ్యాన్ని పోగొట్టుకుంటున్నారో, ఇప్పుడే నాన్నగారి చేతిలో ముక్కలుముక్కలైన ఆ వుత్తరం చదివితే తెలుస్తుంది. ఇల్లాంటి వుత్తరాలు ఆయన అనేకం రాశారట. కాని యే ఒక్కటీకూడా నా చేతిలో పడకుండా, ఆ ముక్కలు కూడా నాకు అగుపించకుండా జాగ్రత్త పడ్డారు నాన్న. ఇంత కక్ష వహించ డానికి, ఆయన చేసిన తప్పేమిటమ్మా? నువ్వే చెప్పమ్మా, తప్పేమిటి?" ఆవే శంతో చెప్తూ ఆగి, కంట తడిపెట్టు కుంది వసుధ చివరిలో ఆమె స్వరం బొంగురుపోయింది.

సీతాలక్ష్మి ఏం జవాబు చెబుతుంది? ఆ ధైర్యం ఆమెకి లేదు. మౌనంగా వూరుకుంది.

"తప్పేమిటని అడుగుతున్నావా? నీకు తెలీదూ?" కోపంగా, వెటకారంగా అన్నాడు భానోజీరావు – అతని కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి.

సీతాలక్ష్మికి ఏమీ పాలుపోవడంలేదు. పిచ్చిగా, ఆత్రుతగా ఆ యిరువురికేసి చూడ్డం తప్పించి, యింకేం చెయ్యలేక పోయింది.

"తెలుసు నాన్నా! బాగా తెలుసు. కాని, అది శిక్షార్హమైన తప్పని మీరెలా నిర్ణయిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా వుండవు. ఎప్పుడెలా పరిణమిస్తాయో కూడా యెవ్వరమూ చెప్పలేం. ఒక్కొక్క ప్పుడు పరిస్థితులు విషమిస్తే గత్యంతర మేమీ లేక వంటిమీది నగలు అమ్ముకో వడం తప్పనిసరైతే అది 'తప్పు' అని పించుకోదు. ఇది సాధారణ విషయం. ఆయనకి వుద్యోగం పోయింది. అది అనుకోకుండా వచ్చిపడిన ఆపాంతరం. కుటుంబం గడవాలి–మరో ఆధారం లేదు. ఏం చేస్తారు చెప్పండి? మీరే ఆ స్థితిలో వుంటే, ఏం చేస్తారు? మార్గం మరోటి లేక, అనగ అమ్మేశారు. నేనే అమ్మేయ మన్నాను కూడాను. మళ్ళీ రోజులు బాగుంటే, చేయిస్తా మన్నారు. ఇప్పుడు మంచి వుద్యోగం దొరికిందట... చేయిస్తా రేముంది? జీవించడానికి బంగారం వు



గొలుసే పెద్ద అవసర మన్పించుతోందుగా! ఇది తప్పా? ఆలోచించండి నాన్న. ఇంతా చూస్తే ఆ నగ నా సొత్తు. దాని కోసం మీ రింత కార్పణ్యం వహించడం చాలా అసభ్యంగా వుంది."

భానోజీరావు కోపం, ఇనుమడించింది.

"ఏవిఁటీ, నీ సొత్తా?"

"ఔను నాన్నా నా సొత్తు... స్త్రీ ధనంగా మీరు నా కిచ్చింది నాది కాక, యింకెవరి దవుతుంది చెప్పండి. మీకు ఆ వస్తువుపై యెంత అధికార ముందో, ఆయనకీ అంతే అధికార ముంది;" నిష్కర్షగా చెప్పింది వసుధ.

భానోజీరావు నీరైపోయాడు. అతని నోట చప్పున మాట రాలేదు. గుండెలు జోరుగా కొట్టుకుంటున్నాయి. పళ్ళు పటపట కొరికాడు అప్రయత్నంగా.

"ఇంతదూరం వచ్చిందన్న మాట వ్యవహారం! నువ్వేదో అమాయకురాలి వనుకున్నానుగాని యిలా నన్నే ఎదిరిస్తా వని అనుకోలేదు వసుధా. ఏవిఁటిలా మారిపోయావు? నీ కేం మతిపోలేదు కదా?" విసురుగా ఆమెకి దగ్గరగా వచ్చి అన్నాడు.

వసుధ మాత్రం భయపడలేదు. "మతి పోలేదనే అనుకుంటున్నాను నాన్నా!"

ఈ జవాబుతో మరింత రెచ్చిపోయాడు భానోజీరావు.

"మతి చలించేరోజు కూడా వస్తుందిలే!" ఆ వుద్రేకంలో అనేశాడు.

"ఆ రోజు రాకుండా వుండడానికే, నా యీ ప్రయత్నమంతాను నాన్నా! అందుకే, నే నో నిర్ణయానికి వచ్చాను."

"ఏవిఁటది?"

"ఆయనదగ్గరికి వెళ్ళిపోతాను."

భానోజీరావు నివ్వెరపోయాడు. తన

చెవులను తనే నమ్మలేకపోయాడు. తన నిర్ణయాన్ని ఆదారంగా చేసుకొని నడవవల్సిన వ్యక్తి, స్వంత నిర్ణయాన్ని వెల్లడిచేస్తుంటే, నివ్వెరపోడూ మరి? ఎంత సాహసం, ఎంత ధైర్యం! అనుకున్నాడు. అతని పట్టుదల పరాకాష్ఠనందుకుంది.

“వెళ్ళిపోతావా? ఈ గడప దాటి యెక్కడికి వెళతావో నేనూ చూస్తాను.” పిచ్చిగా గర్జించాడు.

సీతాలక్ష్మికి యేడుపొచ్చింది. కళ్ళనీరు కార్చడం తప్పించి ఏం చెయ్యగలదు పాపం!

వసుధ, చిన్న మందహాసం చేసింది, “మీరు నన్ను ఆపలేరు నాన్నా! భర్త సాన్నిధ్యానికి పోయేందుకు భార్య తీసుకున్న నిర్ణయ మిది. ఆ నిర్ణయాన్ని కాదనే హక్కుగాని, ధైర్యంగాని మీకు లేదు. రేపు వుదయమే నేను ఆయన దగ్గరికి వెళ్ళిపోతున్నాను. నన్ను ఆపడానికి మాత్రం ప్రయత్నించకండి,” అంటూ, చరచరా నడచి తన గదికేసి వెళ్ళిపోయింది. కాస్సేపటికి తలుపులు దభీమని మూసుకున్న శబ్దం వినిపించింది.

భానోజీరావు స్తంభించిపోయాడు. కోపంతో ఒళ్ళంతా కంపించింది. కళ్లు నిప్పుకణాల్లా మెరుస్తున్నాయి. కాని వాటికి శక్తిలేదు. మెదడు ఏవేవో ఆలోచిస్తోంది. కాని ఆ ఆలోచనలకు విలువలేదు. కూతురిలో యీ ధైర్యమూ, పొరవా, ఎలా అంకురించాయో, అతనికి అనూహ్యమయ్యింది. పాపం, అతనికి తెలీదు—మనిషిలో చైతన్యం రావాలేగాని, దానికి ఆనకట్ట కట్టేశక్తి ఎవ్వరికీలేదని.

సీతాలక్ష్మి ఏడుపు లంకించుకుంటూ లోపలికి నడిచింది. ‘భగవాన్! నన్ను నీలో చేర్చుకో తండ్రీ!’ అని ఆమె మనసులో అనుకుందంటే, అతిశయోక్తి కాదు. ఆ పరిస్థితి అల్లాంటిది. ఆమె మనస్తత్వమే ప్రత్యేకమైంది.

ఒంటరిగా ఉన్న భానోజీరావు కోపంతో చిందులుతొక్కుతూ, అక్కడే పచారు చెయ్యడం ప్రారంభించాడు. అతనిలోని వుద్రేకం వుప్పొంగి ప్రవహిస్తోంది. కాని, ఏం చెయ్యగలడు? ఉప్పొంగి ప్రవహించే నది సర్వానాశనం చేస్తుంది. కాని తను అలా చెయ్యగలడా? లేడు...తాను సంఘంలో ఒక వ్యక్తి. సంఘానికి తలొగ్గాల్సిందే! తప్పదు... నిజమే తనే ఓడిపోయాడు—ఓడిపోయాననే అనుకున్నాడు. గాని, ఇంతపరకూ కఠినంగా, అర్థపహితంగా ప్రవర్తించినందుకు పశ్చాత్తాప పడలేదు. ఇరవయ్యో శతాబ్దపు మనిషైనా, రాతియుగం మనస్తత్వం పూర్తిగా అతనిలో అంతరించలేదు పాపం!

వర్షపుజల్లు అధికమయ్యింది. కుర్చిలో కూలబడిపోయాడు నీరసంగా భానోజీరావు. అతను చించి పారేసిన వుత్తరంముక్కలు సగర్వంగా గాలికి యెగురుతూ చెల్లాచెదరవుతున్నాయి. అతను గట్టిగా ఓ నిశ్వాసం వదిలాడు.

——